క్లుప్తంగా

ఇంటింటికీ కుళాయిలతో తాగునీటి సమస్యకు చెక్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేష్

మునగపాక : ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తే తాగునీటి సమస్య తలెత్తదని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ హాల్లో మంగళవారం జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా కమ్యూనిటీ కాంట్రాక్ట్ వర్క్స్‌కు సంబంధించి జలసంఘం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలసంఘం సభ్యులు బాధ్యతగా పని చేసి పథకం విజయవంతం అయ్యేందుకు, ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పథకం జిల్లా కో–ఆర్డినేటర్లు పుల్లారావు, నరేష్, వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే లోపాలు సవరిస్తాం



మునగపాకలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మునగపాక : రీ-సర్వేలో జరిగిన లోపాలు సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీటీ వినయ్ తెలిపారు. మునగపాకలో ముసిలితల్లి గుడి, కొత్త మహలక్ష్మి అమ్మవారి గుడి ప్రాంగణాల్లో రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వేలో భాగంగా రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో నమోదైన తేడాలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులెవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. వీఆర్వో హిమబిందు, సర్వే డీటీ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ గ్రామసభ నేడు

రాంబిల్లి : మండలంలోని దిమిలి గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) గ్రామసభ నిర్వహించనున్నట్లు ఏపీవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయ కార్యాలయం వద్ద ఈ గ్రామసభ జరుగుతుందన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

రాంబిల్లి : దిమిలిలో మంగళవారం సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది కోడి పందాలపై దాడులు నిర్వహించారు. ఇక్కడ కోడిపందాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. నలుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఏడు కోడిపుంజులు, రూ. 250 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందాలు నిర్వహించినా, ఆడినా కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

భీష్మ ఏకాదశి సందర్భంగా ఏకాహం



ఒంపోలు శివాలయంలో కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని ఒంపోలు శివాలయంలో మంగళవారం ఏకాహం ఘనంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు ఏకాహం జరిగింది. బొద్దపు శ్రీరామమూర్తి, మంత్రి సూరప్పారావు, ఉల్లింగల గోవింద, రాజాన గోవింద, ధనలక్ష్మి, సత్యారావు, ధనలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నల్లమారమ్మతల్లి పండగ

కోటవురట్ల : సుంకపూరు గ్రామస్తులు నల్లమారమ్మతల్లి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులంతా మెయిన్‌రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- అచ్యుతాపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ సత్యవతితో కలిసి ప్రారంభోత్సవం



ఎర్రవరం శ్మశాన వాటికలో పైపులైన్, బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



పెదపాడులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం : సంక్షేమ పథకాలు అమలు చేసి 'మీకు మేలు జరిగితేనే ఓటు వెయ్యండి' అని అడిగే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఎంపీ సత్యవతితో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శత శాతం సఫలీకృతం అయిందన్నారు. ఖాజీపాలెంలో రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ. 5 లక్షలతో నిర్మించిన దోబీఖానా, పెదపాడులో రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయం, వెదురుపర్తి రోడ్డు వరకూ రూ. 5.70 లక్షలతో నిర్మించిన తారురోడ్డు, పెదపాడులో రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, ఎర్రవరం శ్మశాన వాటికలో రూ. 4 లక్షలతో ఏర్పాటు చేసిన మంచి నీటి పైపు లైన్లు, ఎస్సీ కాలనీలో రూ.9 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ఎం.జగన్నాథపురంలో రూ. 8 లక్షలతో నిర్మించిన ఫ్లోరింగ్, చోడపల్లిలో రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 23.96 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌లను నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

22న మునగపాకలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట



మునగపాకలోని శ్రీకృష్ణుని దేవాలయం

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో ఈ నెల 22న శ్రీకృష్ణుని దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం దేవాలయ ప్రాంగణంలో భారీ హోమం నిర్వహించారు. 22న జరగనున్న విగ్రహ ప్రతిష్టలో భాగంగా పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పాండురంగ స్వామి దేవస్థానంలో పూర్ణాహుతి



పాండురంగస్వామి ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీ రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో పూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ పాంచరాత్రా మోక్ష ప్రకారం శ్రీ రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి కల్యాణ మహోత్సవముల్లో భాగంగా వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు యియ్యణ్ణి కృష్ణస్వామి వేదమంత్రోచ్ఛరణాలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో నరిసే వెంకట్రాది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల పంపిణీ



మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

పాయకరావుపేట : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న పదవ తరగతి విద్యార్థుల నమూనా పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చినట్లు ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల బృందం వెల్లడించింది. పట్టణంలో గల చైతన్య పాఠశాల, సిద్ధార్థ, గౌతమ్ మోడల్ స్కూల్, కనోస్సా, ఎస్.నర్సాపురం జెడ్పీ పాఠశాల, జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతా కృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ వేడుకలు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మునగపాక : స్థానిక నేషనల్ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కసిరెడ్డి బాలసంజీవరావు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శరగడం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కాండ్రేగుల ఈశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బొడ్డేడ మహేష్, డైరెక్టర్లు బొడ్డేడ రామ శంకరరావు, వేగి శ్రీను, ప్రియదర్శిని ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ వేగి వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సెజ్‌లో అక్రమాలపై పోరాడుతాం'



ఐక్యత చాటుతున్న అఖిలపక్ష నాయకులు

అచ్యుతాపురం : అచ్యుతాపురం సెజ్‌లో జరుగుతున్న దోపిడీపై పోరాడుతామంటూ మంగళవారం అఖిలపక్షం తీర్మానించింది. కంపెనీ ప్రతినిధులను బెదిరించి అక్రమ వసూళ్లు చేపడుతున్న వారిని, సీఎస్ఆర్ ఫండ్‌ను దుర్వినియోగం చేస్తున్న వారిపైనా పోరాడతామన్నారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్

యలమంచిలి రూరల్ : వచ్చే నెల 9న యలమంచిలి న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు యలమంచిలి మండల న్యాయ సేవాధికార సంస్థ అధికారి ఎ. సాయికుమారి తెలిపారు. యలమంచిలి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పరిష్కారం చేసుకోదగిన వివిధ సివిల్, క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవచ్చని ఆమె కక్షిదారులకు తెలిపారు. చిన్న చిన్న వివాదాలకు సంబంధించి కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగపర్చుకోవాలని ఆమె సూచించారు.

నల్లమారమ్మ జాతరకు ఏర్పాట్లు

మాకవరపాలెం: కొండల అగ్రహారంలో నల్లమారమ్మతల్లి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాదిరిగానే గురువారం ఇక్కడ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం అమ్మవారి గరగలను ఆలయం వద్ద నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగించారు. జాతర రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు తెలిపారు. గరగల ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ నాయకులు చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భద్రత



పాయకరావుపేటలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



తోటాడలో రోగులకు కళ్లజోళ్లు అందజేస్తున్న దృశ్యం



పద్మనాభరాజుపేటలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవింద్



పందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్ అందిస్తున్న కాశీవిశ్వనాథరావు తదితరులు

పాయకరావుపేట: మండలంలో 402 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండవ విడతలో భాగంగా నామవరం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం జరిగింది. పాయకరావుపేట పీహెచ్‌సీకి చెందిన వైద్యులు డి.సుభాష్, ఎ.జయలక్ష్మి, కె.రవికిరణ్, ప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, గుండె, కంటి జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేసి, తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో..

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం స్థానిక ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మితో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. నిష్ణాతులైన వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. అలాగే 140 రకాల మందులు అందుబాటులో ఉంచారన్నారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, డాక్టర్ విమలగిరి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభరాజుపేటలో..

యలమంచిలి : యలమంచిలి మండలం పద్మనాభరాజుపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రారంభించారు. ప్రజలకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకుని మందుల కిట్‌ను ప్రారంభించారు.ఈ శిబిరంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి ఉచితంగా వైద్య సేవలు, మందులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, సర్పంచ్‌లు మొగలపల్లి సత్యనారాయణ, గొన్నాబత్తుల శివ, ఎంపీటీసీ సభ్యుడు ఊటకూటి శేఖర్, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, అడపా అప్పలనాయుడు, మొగ్గా గోవింద్, వైద్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పందూరు గ్రామంలో..

కోటవురట్ల : పందూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. విశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ మొదటి విడతలో నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన రాగా రెండో విడతలో కూడా అదే తరహాలో విజయవంతం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల జగదీష్, ఎంఈవో–2 శ్రీజోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సీఐ బుచ్చిరాజు సమీక్ష



జాతరపై సమీక్షిస్తున్న నాయకులు

అచ్యుతాపురం : పూడిమడక మాఘమాస జాతర ఏర్పాట్లపై సీఐ బుచ్చిరాజు ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జాతరకు లక్ష మంది విచ్చేసే అవకాశం ఉన్నందున అందరి భద్రతను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే జాతర నేపథ్యంలో భక్తులు ఎవ్వరూ అవసరానికి మించిన నగదు, బంగారు నగలు వేసుకుని రావద్దని సూచించారు. స్నానం చేసే భక్తుల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వైభవంగా లక్ష్మీమాధవ స్వామి కల్యాణం



స్వామి కల్యాణం అనంతరం భక్తులకు అన్న సమారాధన



లక్ష్మీ మాధవ స్వామి

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో లక్ష్మీ మాధవ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాఘపౌర్ణమి జాతర మహోత్సవాలు స్వామి కల్యాణంతో శుభారంభం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆచార సంప్రదాయాలతో శ్రీదేవి భూదేవి లక్ష్మీ మాధవ స్వామి వార్షిక కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దంపతులకు స్వామి కల్యాణానికి వినియోగించిన తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

గ్రామ స్వరాజ్యమే సీఎం జగన్ ధ్యేయం



శ్రీరాంపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు



ఎస్.రాయవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న సమన్వయకర్త కంబాల జోగులు

పాయకరావుపేట : గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో గల శ్రీరాంపురంలో వలంటీర్ల అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో వలంటీర్లు 60 నుంచి 70 గృహాలు సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో వారికి మంచి భవిష్యత్తు వుంటుందని, అందరూ సేవా భావంతో పని చేసి, ఎన్నికల్లో మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేద్దామన్నారు. ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సకాలంలో అర్హులందరికీ అందేలా వలంటీర్లు గర్వించదగ్గ రీతిలో పని చేస్తున్నారని అన్నారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్రకు ఎంపికైన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ ఎంపీటీసీ పులగల రాఘవ, ఎంపీడీవో కె.స్వప్న, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, పాల్మన్‌పేట, మంగవరం, గోపాలపట్నం, మాసాహెబుపేట సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, వంగలపూడి రామారావు, పన్నీరు బాబ్జి, గెద్దమూరి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి వైవీ సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం సచివాలయంలో..

ఎస్.రాయవరం : అవినీతిరహిత పాలన అందించేందుకు గ్రామ వలంటీర్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడిందని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరం సచివాలయంలో జేవీపాలెం, సైతారుపేట, వేమగిరి, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వాకపాడు, లింగరాజుపాలెం, ఎస్.రాయవరం, పి.ధర్మవరం, పెనుగొల్లు గ్రామాలకు చెందిన సంబంధించి మంగళవారం వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, నాయకులు శ్రీపతిరాజు, లక్కోజు ఆదిమూర్తి, కర్రి వరహాలరావు, అద్దేపల్లి బొజ్జన్న, వెదుళ్ల బంగారి, మధువర్మ, గరగా శ్రీను, వైబోయిన సత్యనారాయణ, చోడిపల్లి కోదండ, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ధూళి శ్రీనుబాబు, ఎంపీటీసీలు శానాపతి రాము, బైపా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసి సభ్యుడు కొణంకోట నీలేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు వలంటీర్ల ఎంపిక..

పాయకరావుపేట : మండలంలోని ఇద్దరు వలంటీర్లు సేవా వజ్ర, సేవా రత్న, 462 మంది సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. సేవా వజ్రకు 45 వేలు, సేవా రత్నకు 30 వేలు, సేవామిత్రకు 15 వేలు చొప్పున నగదు అందించనున్నట్లు తెలిపారు.

నేడు వలంటీర్లకు పురస్కారాల పంపిణీ..

యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల వలంటీర్లకు బుధవారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్ల సేవలను మెచ్చి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవా వజ్ర,సేవారత్న,సేవా మిత్రా పురస్కారాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

జాగ్రత్తలతోనే రబీ పంటలో తెగుళ్ల నివారణ

యలమంచిలి : రబీ పంటల్లో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రమణమూర్తి అన్నారు. యలమంచిలి మండలం, డివిజన్ పరిధిలో ఉన్న పంట పొలాలను మంగళవారం శాస్త్రవేత్తల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా పెసర, మినుము, జనుము పంటలను పరిశీలించి మినుము, పెసర పంటల్లో బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు ఉన్న పంటలను గుర్తించారు. కార్బనిజం-మాంకోజబ్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అపరాల సాగులో విత్తులు వేసిన రెండు మూడు రోజుల లోపు పెండిమిథాలిన్ ఎకరానికి ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. చెరకులో వడల తెగులు గమనించి దీనికి నివారణ చర్యగా చెరకు అవశేషాలు తొలగించి లోతు దుక్కు చేసుకోవాలన్నారు. నాటేటప్పుడు నేల తయారీలో 90 కేజీల పశువుల ఎరువు, 10 కేజీల వేపపిండి, రెండు కేజీల ట్రైకోడెర్మా ఫార్ములేషన్ కలిపి ప్రతి మూడు రోజులకు ఒకసారి నీటిని చిలకరించాలన్నారు. ఈ విధంగా వారం పది రోజులు దాటిన తర్వాత చెరకు మచ్చలను ట్రైకోడెర్మా ఫార్ములేషన్ 10 గ్రాములు లీటర్ నీటిలో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అలాగే నువ్వు పంటకు 20 నుంచి 30 రోజుల్లో ఆరుపదునుగా తడి చేసి ఎకరానికి పాతిక కేజీల యూరియా చల్లాలని సూచించారు. యలమంచిలి మండలం కొత్తపాలెం, రాంబిల్లి మండలం మామిడివాడ, పంచదార్ల, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, పెదపాడు గ్రామాల్లో రబీ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్, ఏబీఏం శిరీష, అనకాపల్లి అగ్రికల్చర్ అధికారి, శాస్త్రవేత్త తులసి, యలమంచిలి వ్యవసాయ సంచాలకులు రవి ప్రకాష్, యలమంచిలి వ్యవసాయాధికారి మోహనరావు, అచ్యుతాపురం మండల వ్యవసాయాధికారి శ్రీశంకర్‌గోవింద, రాంబిల్లి మండల వ్యవసాయాధికారి సుమంత, అభ్యుదయ రైతులు, ఆయా గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.